



# నిబంధనలు 'గాలికి'.. బడి ముందే 'బెల్టు' కొట్టు!

- గుడి, బడి పక్కనే మద్యం విక్రయాలు...
- చట్టాలను తుంగలో తొక్కి నిర్వహణ
- రాత్రివేలల్లో పాఠశాలే మద్యం బాబులకు అడ్డా.....
- చూస్తూ ఊరుకుంటున్న అధికార యంత్రాంగం!

**మంగపేట, జూలై 23డీడీ9 వార్త**
**డీడీ 9 స్పెషల్ స్టోరి**

అది అక్షరాల ఆలయం... భవిష్యత్ భారత పౌరులను తీర్చిదిద్దే పవిత్రదేవాలయం,అలాంటి పాఠశాల నేడు రాత్రివేళ మద్యం సేవించే వారికి అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు మంగపేట మండలం చేరుపల్లి గ్రామంలో వినిపిస్తున్నాయి
పుస్తకాలతో బడికి వస్తున్న చిన్నారులకు , మద్యం సీసాలు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి.
పాఠశాల సమీపంలోనే రెండు బెల్టు షాపులు కొనసాగుతుండడం వాటి ద్వారా బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.
దీంతో తాగుబోతుల ఆగడాలు చూస్తూ విద్యార్థులు భయాందోళనకు గురౌతున్నారని విద్యార్థులు తల్లి తండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గుడి, బడి సమీపంలో మద్యం విక్రయాలు నిషేధమన్న ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేసి చేరుపల్లి గ్రామంలో విక్రయాలు జరపడం పై గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

**బడికి కూతవేటు దూరంలోనే రెండు బెల్టు షాపులు**

మంగపేట మండలం చేరుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఏకంగా రెండు అక్రమ బెల్టు షాపులు బహిరంగంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నాయి. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వెళ్తుంటే, అదే మార్గంలో మద్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులు కనిపించడం సాధారణ దృశ్యంగా మారింది. ఇది విద్యార్థుల మానసిక వికాసంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రికి పాఠశాలే బహిరంగ బార్**

పగలు మద్యం అమ్మకాలు జరిపే ఈ బెల్టు షాపులు, రాత్రి పూట పాఠశాలనే మద్యం అడ్డాగా మార్చేస్తున్నాయి. మద్యం కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు నేరుగా పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లి అక్కడే మద్యం సేవిస్తూ అల్లర్లు, అసభ్య ప్రవర్తనకు పాల్పడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఉదయం బడికి వచ్చే చిన్నారులకు పగిలిన మద్యం సీసాలు, కాలిపోయిన సిగరెట్ పీకలు, ప్లాస్టిక్ గ్లాసులు కనిపించడం నిత్యకృత్యంగా మారింది. విద్యాలయం పవిత్రత పూర్తిగా దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**చిన్నారుల భవిష్యత్తుతో చెలగాటం**

చదువు చెప్పాల్సిన పాఠశాల ఆవరణలోనే మద్యం మత్తు రాజ్యమేలడం అత్యంత ఆందోళనకర విషయం. ఇటువంటి పరిస్థితులు విద్యార్థుల్లో భయం, అసురక్షిత భావం కలిగించడమే కాకుండా, చెడు అలవాట్లకు పరోక్షంగా ప్రోత్సాహం ఇచ్చే ప్రమాదం ఉందని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు.
బడిముందే మద్యం అమ్ముతుంటే పిల్లలకు ఏ విలువలు నేర్పుతాం? రాత్రిళ్లు తాగుబోతులు పాఠశాలలో కూర్చుని మద్యం సేవిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం బాధాకరం.

**అధికారుల మౌనం.. అక్రమాలకు అండా?**

పాఠశాలలు, దేవాలయాల సమీపంలో మద్యం విక్రయాలు నిషేధమనే నిబంధనలు ఉన్నప్పటికీ, చేరుపల్లిలో అవి బహిరంగంగా ఉల్లంఘించబడుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.






# ఇబ్రహీంపూర్‌లో ఉచిత మెడికల్ క్యాంపు

**జనగామ జులై 23(డిడి 9 వార్త )బ్యూరో**

ఉప సర్పంచ్ చింత నరేష్ ప్రారంభించిన మెడికల్ క్యాంపు రఘునాతపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును ఉప సర్పంచ్ చింత నరేష్ ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరం, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూడడం, జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు.
అనంతరం శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ANM అన్నపూర్ణ , ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# లక్ష్మీదేవి పేటలో బెల్ట్ దందా, గుడుంబాను నియంత్రించని ఎక్సైజ్ పోలీసులు

- ఓవైపు మద్యం..., మరోవైపు గుడుంబా...,
- మద్యం మత్తులో చిత్తవుతున్న యువత
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- తాగిన మైకంలో గొడవలు
- పోలీసులకు తలనొప్పిగా మారిన వైనం
- గొడవల నివారణకు నేడు పోలీసుల అవగాహన సదస్సు

**ములుగు, జూలై 23, డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలో యువత చెడు మార్గంలో ప్రయాణిస్తుంది. నిత్యం మద్యం మత్తులో ఉంటూ గొడవలకు దిగుతున్నారు. గ్రామంలో బెల్ట్ షాపులు మూడు పూలు ఆరు కాయలుగా విలసిల్లుతున్నాయి. ఓవైపు మద్యం మరోవైపు గుడుంబా అందుబాటులో ఉండడంతో యువత చెడుతోవబడుతున్నారు. తాగిన మైకంలో ఘర్షణ పడుతూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గత కొంతకాలంగా గ్రామం నుండి పోలీస్ స్టేషన్కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో గ్రామ పోలీసు అధికారి బాలయ్య, వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజులు యువత చెడు మార్గంలో పట్టకుండా ఉండేందుకు, గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని, అలాగే యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు శుక్రవారం రోజు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉంటే గ్రామంలో మద్యం షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. నూటికి డెబ్బై శాతం కిరాణాలు బెల్ట్ షాపులుగా మారడం మద్యం అందుబాటులోకి రావడంతో యువకులు మద్యం మత్తులో చిత్తవుతున్నారు. పుట్టినరోజుల పేరుతో రాత్రి వరకు మేల్కొని ఉండి కేక్ కటింగ్ చేసి, విందు చేసుకుంటూ తాగిన మైకంలో తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. కాగా గుడుంబా, బెల్ట్ షాపులు నియంత్రించాల్సిన ములుగు ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడంలేదని విమర్శలు నెలకొంటున్నాయి. గతంలో లక్ష్మీదేవి పేటలో బ్రాండ్ షాపు ఉండడంతో నేరుగా బ్రాండ్ షాప్ కి వెళ్లి మద్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం మద్యం షాపు తాళ్లపాడు కేంద్రానికి తరలిపోవడంతో వెంకటాపూర్ నుండి ఆటోలలో మద్యం లక్ష్మీదేవి పేట గ్రామానికి తరలిస్తూ బెల్ట్ షాపులకు వేస్తున్నారు. ఒక క్వార్టర్ మందు సీసా పై 50 రూపాయలు అదనంగా బారం పడుతుంది. కొనుగోలు చేసేవారు ఇదేమని అడిగితే బెల్ట్ షాప్ వాళ్ళు నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని తెలుస్తుంది. మద్యం సీసాలను ఎమ్మార్పీ ధరపై అమ్మాల్సి ఉండగా, బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం సరఫరా చేసే బ్రాండ్ షాప్ యజమానులు ఎమ్మార్పీ ధరపై కొంత పెంచగా, బెల్ట్ షాప్ నిర్వాహకులు తమ లాభం కోసం మరికొంత పెంచుతున్నారు. దీనితో మద్యం ప్రియుల జేబులు చిల్లులు పడుతున్నాయి. నియంత్రించాల్సిన ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, గుడుంబా అమ్మకాలు కొనసాగుతున్నాయి.




# ఎస్ఐఆర్‌పై సమీక్ష

**జనగామ జూలై 23 (డీడీ 9 వార్త) బ్యూరో**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్, ఇతర నేతలు పాల్గొన్నారు. బూత్ స్థాయిలో ఫారాల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, బీఎల్ఏల పనితీరు, ఇంటింటి ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై చర్చించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నేడు రౌండ్ టేబుల్ సమావేశం

- కరపత్రాలను ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు

**భద్రాచలం, జూలై 23 డిడి9 వార్త**

కొత్తగూడెంలో నేడు పెండింగ్ స్కాలర్‌షిప్స్ , ఫీజు రీంబర్స్ మెంటుపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం భద్రాచలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయినలు వెంటనే విడుదల చేయాలని కోరారు. నేడు కొత్తగూడెంలో జరిగే సమావేశంకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ ఏనుగులు రాకేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కీసర యువరాజు, కొలిపాక శివ, ఇమంది నాగేశ్వరరావు, సుదీర్ పాల్గొన్నారు.



# జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో భద్రాద్రి సత్తా.. తెలంగాణకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో కీలక పాత్ర

- మాస్టర్స్ జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారుల పతకాల పంట.. విజేతలను అభినందించిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 23 (డిడి9 వార్త)**

మహారాష్ట్ర రాష్ట్రంలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల విజయాలతో తెలంగాణ క్లాసిక్ విభాగంలో ప్రతిష్ఠాత్మక ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించగా, ఆ విజయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులే సింహభాగం పతకాలు అందించడం గర్వకారణమని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ రామిరెడ్డి తెలిపారు. పోటీల్లో డి.వి. శంకరరావు క్లాసిక్ విభాగంలో మూడు రజతాలు, ఒక రజత ఓవరాల్‌తో పాటు ఎక్విప్డ్ విభాగంలో మూడు రజతాలు, ఒక రజత ఓవరాల్ సహా మొత్తం ఎనిమిది రజత పతకాలు సాధించారు. ఎండి. అబ్బాస్ కూడా ఇదే తరహాలో క్లాసిక్, ఎక్విప్డ్ విభాగాల్లో కలిపి ఎనిమిది రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మల్లేష్ క్లాసిక్ విభాగంలో నాలుగు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటగా, శేషు ఎక్విప్డ్ విభాగంలో ఒక కాంస్య పతకం అందుకున్నారు. కరుణాకుమార్ పోటీల్లో తొమ్మిదో స్థానం దక్కించుకుని ప్రతిభ కనబరిచారు.
తెలంగాణ రాష్ట్రానికి క్లాసిక్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారుల పాత్ర విశేషమని జీవీ రామిరెడ్డి పేర్కొన్నారు. విజేతలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజీ, సంయుక్త కార్యదర్శి శోభన్ నాయక్‌తో పాటు పట్టణ ప్రముఖులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, సిటీ స్టైల్ జిమ్ సభ్యులు ఘనంగా అభినందించారు.

